ముంపు ముంగిట గుడ్డంపల్లి

శ్రీసత్యసాయి జిల్లా – వైఎస్సార్ కడప జిల్లా సరిహద్దున పార్నపల్లి వద్ద నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)లోకి గండికోట రిజర్వాయర్ నుంచి నీరు వస్తోంది. దీంతో సమీపంలోని తాడిమర్రి మండలం గుడ్డంపల్లిలోకి కూడా నీరు నెమ్మదిగా చేరుతోంది. నీటి సరఫరా ఆగకపోతే గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- గండికోట నుంచి సీబీఆర్‌కు చేరుతున్న నీరు
- ఇదే క్రమంలో గుడ్డంపల్లిలోకి చొచ్చుకొస్తున్న వైనం
- ఇళ్లు నీటమునిగే ప్రమాదముందని గ్రామస్తుల ఆందోళన


గుడ్డంపల్లి సమీపంలోకి వచ్చిన సీబీఆర్ నీరు


గుడ్డంపల్లి గ్రామం వ్యూ

తాడిమర్రి: పులివెందుల నియోజకవర్గానికి తాగు, సాగునీరు, ఉమ్మడి అనంతపురం జిల్లాకు తాగు నీటిని అందించే లక్ష్యంతో 1990లో పది టీఎంసీల సామర్థ్యంతో సీబీఆర్‌ను నిర్మించారు. తాడిమర్రి మండలం పెద్దకోట్ల, గుడ్డంపల్లి, మోదుగులకుంట, మర్రిమాకులపల్లి, చిన్నచిగుళ్లరేవు గ్రామాలతో పాటు ముదిగుబ్బ మండలం చిన్నకోట్ల, మొగలచెట్లపల్లి, రాఘవపల్లి, పెద్దచిగుళ్లరేవు, ఉప్పలపాడు తదితర గ్రామాలు సీబీఆర్ ముంపునకు గురయ్యాయి. దీంతో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొన్ని గ్రామాల ముంపు బాధితుల ఇళ్లు, వ్యవసాయ భూములకు పరిహారం ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మర్రిమాకుపల్లిలో కుటుంబానికి రూ.10 లక్షలు, చిన్నచిగుళ్లరేవు గ్రామంలోని కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల ప్రకారం పరిహారం అందించారు.

- గతంలో పెద్దకోట్ల, గుడ్డంపల్లి, మోదుగులకుంట గ్రామాలకు నష్టపరిహారం ఇవ్వడంతో మూడు గ్రామాలు పునరావాసం కింద మరో ప్రాంతం గుడ్డంవంకకు ఆనుకుని గ్రామాలను పునఃనిర్మించారు. ప్రతి ఏటా గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకం కింద నాలుగు పైపులకు గాను మూడు పైపుల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. అయితే గుడ్డంవంకకు సమీపంలోనే గుడ్డంపల్లి ఉండటంతో డ్యామ్ బ్యాక్‌వాటర్ చొచ్చుకొస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి గత 15 రోజులుగా రోజుకు 12,000 క్యూసెక్కులు నీటిని పంపింగ్ చేసుకుంటున్నారు. వారం రోజులుగా రెండింటిలో నీటిని నిలుపుదల చేశారు. ఒకదానిలో మాత్రమే నీరు వస్తోంది. దీనికి తోడు ధర్మవరం చెరువు నిండి మరవ పారుతుండటంతో సీబీఆర్‌లో నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 9 టీఎంసీల నీరు ఉంది.

భయం.. భయం

గుడ్డంపల్లిలోకి డ్యామ్ నీరు ప్రవేశిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దాదాపు 300 మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో స్నానపు గదుల నుంచి వెళ్లే నీటి కోసం ఎవరికివారు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోకి నీరు ప్రవేశిస్తుండటంతో భూగర్భజలాలు పెరిగాయి. ఈ క్రమంలో స్నానపు గదులు, మరుగుదొడ్లనుంచి నీరు గుంతల్లోకి ఇంకిపోవడం లేదు. దీంతో బాత్రూమ్‌ల్లో నిరంతరాయంగా నీటి చెమ్మ ఉండటంతో పాటు ఇళ్లల్లోకి తేళ్లు, జెర్రెలు, పాములు తదితర విషపురుగులు వస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు. గ్రామ సమీపంలో నీరు పుష్కలంగా ఉండటంతో పిల్లలు ఈత కోసం వెళ్లి ఎక్కడ ప్రాణాల మీదకు తెచ్చుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా డ్యామ్ నీరు గ్రామంలోకి రాకుండా నిలుపుదల చేయడంతో పాటు నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నీరు ఇంకడం లేదు



సీబీఆర్ నీరు గ్రామానికి అతి సమీపంలోకి రావడంతో ఇబ్బందికరంగా మారింది. బాత్రూముల్లో నీరు ఇంకిపోవడం లేదు. దీంతో స్నానాలు చేయాలన్నా, మరుగుదొడ్డికి వెళ్లడానికి అవస్థలు పడుతున్నాం. మరోపక్క పశువులను మేత కోసం అడవికి తీసుకెళ్లే దారులు నీటమునిగాయి. పొలాల్లోకి వెళ్లేందుకు కూడా దారులు లేని పరిస్థితి ఏర్పడుతోంది. వెంటనే సీబీఆర్ నీరు గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టాలి.

–వెంకటనారాయణరెడ్డి, గుడ్డంపల్లి, తాడిమర్రి

రక్షణ గోడ నిర్మించాలి



గుడ్డంపల్లి గ్రామస్తులకు సీబీఆర్ ఆర్‌అండ్‌ఆర్ కింద నష్ట పరిహారం అందించడంతో పాటు పునరావాసం కల్పించాలి. ప్రతి ఏటా సీబీఆర్‌లోకి గండికోట రిజర్వాయర్ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా దిగుమతి చేసుకోవడం, ఆ సమయంలో నీరు గ్రామంలోకి వచ్చి చేరుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. నష్ట పరిహారం వచ్చేలోగా గ్రామంలోకి సీబీఆర్ నీరు రాకుండా తూర్పు దిక్కున గుడ్డం వంక పాడవునా రక్షణ గోడ (ప్రొటెక్షన్ వాల్) నిర్మించాలి.

–పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ, తాడిమర్రి

నీటి నిలుపుదలకు లేఖ రాశాం

సీబీఆర్‌లోకి వస్తున్న గండికోట రిజర్వాయర్ నీటిని నిలుపుదల చేయడానికి ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. వారి నుంచి అనుమతి రాగానే నీటిని నిలుపుదల చేస్తాం. అలాగే గుడ్డంపల్లిలోని సీబీఆర్ నీరు చేరకుండా గుడ్డం వంకకు పడమటి భాగాన ప్రొటెక్షన్ వాల్ నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాం.

– చంద్రసురేష్, డీఈ, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పార్నపల్లి

నకిలీ మద్యంపై నేడు నిరసన

పుట్టపర్తి టౌన్: నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ బుదవారం ఉదయం 9 గంటలకు పుట్టపర్తిలోని ప్రొహిబేషన్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. గాంధేయ మార్గంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎవరినీ దూషించకుండా కార్యక్రమాన్ని జయప్రదంచేసేలా కార్యాచరణను రూపొందించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంత చేయాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు.

ఓడీచెరువు: ఈ నెల 15న కల్తీ మద్యం విక్రయాలను అరికట్టాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరుతూ పుట్టపర్తి ఎక్సైజ్ కార్యలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలకన్వీనర్ లక్ష్మీరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, తరలిరావాలని కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ – ఒకరికి తీవ్ర గాయాలు

కదిరి టౌన్: స్థానిక మరకత మహాలక్ష్మి ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో కుటాగుళ్లకు చెందిన సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటాగుళ్ల నుంచి సాయికుమార్ ద్విచక్రవాహనంలో కదిరికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. సాయికుమార్ తల, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించినట్లు ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్

ప్రధాని మోదీ పర్యటనను అడ్డుకుంటాం

పుట్టపర్తి టౌన్/పెనుకొండ రూరల్: కర్నూలుకు చెందిన సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేస్తానని ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చి న్యాయం చేయలేదని, అలాంటి వారి కర్నూలు పర్యటనను అడ్డుకుంటామని అఖిల భారత బంజారా సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పుట్టపర్తిలో ప్రకటన విడుదల చేయడంతో పాటు పెనుకొండలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజనుల దాడులు పెరిగిపోయాయన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 16న ప్రధాని పర్యటన అడ్డుకుంటామని పేర్కొన్నారు. పెనుకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల భారత బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడు రాజేంద్ర నాయక్, జనరల్ సెక్రటరీ విశ్వనాథ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


పెనుకొండలో విలేకరులతో మాట్లాడుతున్న బంజార సంఘం నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ధర్మవరం రూరల్: మండలంలోని పోతులనాగేపల్లిలో మంగళవారం యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, వ్యక్తిగత బీమా, ఆర్థిక భద్రత, సంతృప్తి స్థాయిలో ఆర్థిక సమిలిత్వం అనే అంశాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఆర్బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రాము, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణ, బ్రాంచ్ మేనేజర్ విష్ణు, సర్పంచ్ మౌనిక హాజరయ్యారు.


ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పేట్రేగుతున్న మట్టి మాఫియా

- అనుమతి లేకుండా గరుసు తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ధర్మవరం రూరల్: గరుసు మట్టి రవాణా అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నిత్యం ఆదాయం వచ్చే మట్టి తవ్వకాలపై కూటమి నాయకులు దృష్టి సారించారు. నిత్యం, పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో పగలు, రాత్రి తేడా లేకుండా గరుసు మట్టి గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు తరలిస్తున్నారు. విషయం అటు పోలీసులకు, ఇటు రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చి.. ఆ భూములను చదును చేయడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు గరుసు తరలిస్తున్నారు. ఇటీవల కాలంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో ధర్మవరం పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయ భూములను ప్లాట్లు వేస్తున్నారు. వాటిని చదును చేయడానికి గరుసును చెరువులు, కొండ ప్రాంతాల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.


గరుసు మట్టిని తరలించే టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్లడంతో ఛిద్రవువుతున్న రోడ్డు

కొండలు కరిగిపోతున్నాయి

పట్టణానికి సమీపంలో వున్న సుబ్బారావుపేట, ఓబుళనాయనపల్లి, రావులచెరువు సమీపంలో ఉన్న చెరువులు, గుట్టల్లో గరుసు నాణ్యతగా ఉండడంతో.. వాటిపై అక్రమార్కుల కన్ను పడింది. అందులో భాగంగా ఈ ప్రాంతాల నుంచి రాత్రింబవళ్లు గరుసును పట్టణానికి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. గరుసు మట్టితో టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో తారు రోడ్లు ఛిద్రమవుతున్నాయి. అదే విధంగా గరుసును తరలించే ట్రాక్టర్లు పొలాల్లో ఎక్కడ బడితే అక్కడ వెళ్తుండడంతో రైతులు ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. మా గ్రామ చెరువు నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా గరుసు మట్టిని తరలిస్తున్నారని రావులచెరువు గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఎవరితో చెప్పుకుంటారో? చెప్పుకోవాలని గట్టిగా దబాయిస్తున్నారన్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ గరుసు తరలిస్తుండడంతో ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పోతోంది. వాల్టా చట్టం మేరకు చెరువులు, గుట్టల నుంచి మట్టిని తరలించాలంటే తహసీల్దార్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి గరుసు తరలించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రావులచెరువు గ్రామ చెరువు నుంచి యంత్రాలతో మట్టి నింపుతున్న దృశ్యం


సుబ్బారావుపేట వంక నుంచి గరుసును తరలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు నాగలూరు గ్రామం వద్ద ఉన్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పాఠశాల చైర్మన్ హర్షవర్దన్, డైరెక్టర్ రూపరాజాకృష్ణా, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అనంతపురం ఆర్డీటీ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన 69వ స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి కుస్తీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన అండర్–14 విభాగంలో యశ్వంత్, అండర్–17 విభాగంలో మదన్, కార్తీక్, దిలీప్, జస్వంత్, లోహిత్, అండర్–19 విభాగంలో అరుణ్, వశీకర్ ప్రతిభ చాటి ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.

పొగాకు వాడకంతో జీవితానికి ముప్పు

ఎన్పీకుంట: పొగాకు వాడకంతో ఆరోగ్యానికే కాక జీవితానికీ ముప్పు వాటిల్లుతుందని టొబాకో నోడల్ అధికారి శమంతకమణి పేర్కొన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వైద్యాధికారి డాక్టర్ జంషీద్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొగాకులో ఉండే నికోటిన్ వలన సుమారు 70 రకాల క్యాన్సర్ల బారిన పడే ప్రమాదముందన్నారు. పరోక్షంగా గర్భిణులు, చిన్న పిల్లలకు కూడా చాలా హానికరమన్నారు. పొగాకు ఉత్పత్తులకు యువత దూరం ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, సీహెచ్ఓ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు శంకరమ్మ, రాధాకుమారి, టీబీ సూపర్‌వైజర్ అక్కాయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంటకోత ప్రయోగాలు

తనకల్లు: పంట కోత ప్రయోగాలను పారదర్శకంగా చేపట్టాలని ఆర్ఎస్‌కే సిబ్బందికి మండల వ్యవసాయాధికారి భారతి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25వ తేదీలోపు పంటకోత ప్రయోగాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మరువ పారుతున్న కొండారెడ్డి చెరువు


కొండారెడ్డి చెరువు మరువ పారుతున్న దృశ్యం

తలుపుల: స్థానిక పంచాయతీ పరిధిలోని కొండారెడ్డి చెరువు మంగళవారం మరువ పారింది. ఎగువన ఉన్న హంద్రీ–నీవా కాలువ ద్వారా చెరువుకు నీటిని వదలడంతో ఇటీవల పూర్తి స్థాయిలో నిండింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి మరవ పారుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మరువ పారిన నీరు పెద్దన్నవారిపల్లి పంచాయతీలోని కొత్త చెరువుకు చేరుకుంటాయి.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి సకాలంలో అధికారులంతా హాజరై తమ ప్రగతి నివేదికలను తెలియజేయాలన్నారు.

బ్లాక్ ప్లాంటేషన్ పనుల పరిశీలన


మొక్కలు నాటుతున్న ఏపీడీ శకుంతల

నల్లచెరువు: ఉపాధి హామీ పథకంలో భాగంగా ఓరువాయి పంచాయతీలో జరుగుతున్న బ్లాక్ ప్లాంటేషన్ పనులను ఏపీడీ శకుంతల మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ కింద కుమ్మర వాండ్లపల్లి ఆలయ భూముల పరిధిలో 110 మామిడి, టెంకాయ, అల్లనేరేడు మొక్కలను నాటే కార్యక్రమానికి ఉపాధి హామీ అధికారులు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీడీ మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ, ఈసీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ


మాట్లాడుతున్న ప్రణాళికాశాఖ సహాయ సంచాలకులు బాలాజీనాయక్

గాండ్లపెంట: మండల పరిధిలోని వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై ప్రణాళికా శాఖ సహాయ సంచాలకులు బాలాజీనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటాను అంచనా వేయడంలో తీసుకునే విధాన నిర్ణయాలకు పంట కోత ప్రయోగాలు ఎలా ఉపయోగపడుతాయో వివరించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద గ్రామ యూనిట్‌గా కంది పంట ఎంపిక చేయడం జరిగిందని, దీనికి సంబంధించి ప్రాథమిక కార్యకర్తలుగా ఉన్న వ్యవసాయశాఖ సిబ్బంది ప్రయోగాలు ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సయ్యద్‌షాదాబ్, మండల సహాయ గణాంకాధికారి నరేంద్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

నల్లమాడ: అన్ని రంగాలలో వెనుకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మండల వాల్మీకి సంఘం సేవాదళ్ అధ్యక్షుడు జింకల చిన్నకేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రిజర్వేషన్ కోసం వాల్మీకులు ఏళ్ల తరబడిగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచాకరమన్నారు. ఎన్నికల సమయంలో కల్లిబొల్లి మాటలతో వాల్మీకులను నాయకులు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.

నకిలీ మద్యంపై నేడు నిరసన

కొత్తచెరువు: నకిలీ మద్యాన్ని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాన్ని నిరసిస్తూ బుధవారం కొత్తచెరువులోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శ్యాంసుందరరెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'జన సమర్థ పోర్టల్'పై అవగాహన సదస్సు

కదిరి అర్బన్: కేంద్రం అమలు చేసే వివిధ పథకాల కోసం జన సమర్థ పోర్టల్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలన్న అంశంపై మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పోలప్ప మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ముద్ర యోజన, ప్రధాన మంత్రి పీవర్స్ ముద్ర యోజన, పీఎంఈజీపీ, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన, పీఎం స్వానిధి సంబంధించి రుణాల కోసం జన సమర్థ పోర్టల్‌లో జిల్లా వాసులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో వెలుగు ఏపీఎం శారదారెడ్డి, గ్రామ సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కదిరి అర్బన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే 'చెకుముకి టాలెంట్ టెస్ట్' పోస్టర్లను స్థానిక ఎన్జీఓ హోంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నరసారెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు జరుగుతాయన్నారు. 8, 9, 10 తరగతి విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు పరీక్షలు తోడ్పడతాయన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు ఎదురయ్యే సమస్యలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు, నివారణ, పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సరస్వతమ్మ, సూపర్‌వైజర్ స్వర్ణలత, సిబ్బంది సనావుల్లా, గిరిజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీ – వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: పట్టణంలోని సంజయ్ నగర్‌కు చెందిన వృద్ధురాలు సుబ్బమ్మ మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా కదిరి గేట్ వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఈ–కేవైసీ తప్పని సరి

ధర్మవరం రూరల్: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీ తప్పని సరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏపీఓ సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ–కేవైసీ చేయించుకోని వారు ఉపాధి పనులు చేయడానికి వీలువుండదన్నారు. ఏవైనా సమస్యలుంటే స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎన్పీకుంట: మండలంలోని బత్తినిగారిపల్లి పరిసరాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రూ.6,005 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ వలీబాషా తెలిపారు.